


తల్లి గర్భవాసంనుంచి బయటికి వచ్చిన నాటి సంబంధ బాంధవ్యాలు ఇరవై సంవత్సరాల జీవితం గడిపేటప్పటికి ఎట్లా మారిపోతై! ఒకప్పుడు ఎంత దగ్గిరిగా ఉండిన వాళ్ళు నా కిప్పుడు యెంత దూరపు మనుష్యులైనా జీవితముతో సంబంధం లేకుండా పోయినారు; నా సొంత తల్లి, నా సొంత అన్నలు—నన్నిప్పుడు తలవటానికి యిష్టపడరు; నా పేరు చెవినిపడితే బాధపడతారు. నా కష్టసుఖాలకూ, వారి కష్టసుఖాలకూ మధ్య పెద్ద అగాధం.


"ఒక తుచ్ఛమైన ప్రేమకోసం అందరి ప్రేమలూ మంట కలిపావు!" అని రాస్తాడే మా పెద్ద అన్నగారు నిజమైన ప్రేమమాత్రం సహించలేనట్టు! నాకు శేషాచలంమీద ప్రేమ ఉందనుకున్నా, ఆ ప్రేమకూ, మా అన్నగారికి నామీద ఉండే ప్రేమకూ వైషమ్యం ఏమిటో! నేను శేషాచలాన్ని ప్రేమించలేవెంతకూ. నేను ప్రేమకోసం తహతహలాడలేదు—స్వేచ్ఛకోసం తహతహలాడాను కాని.

నే నంత కళ్లుతెరవని పసిగుడ్డును కాను. ఈ శేషాచలం వ్యామోహం శాశ్వతం కాదు. ఇతను ఈ వేళ కాకపోతే రేపైనా పశ్చాత్తాపపడి నన్ను విడిచిపెట్టి తన దారి తను చూసుకునేవాడే! నా భారం అతనిమీద ఏ మాత్రం వెయ్యబోవటంలేదు; నేను అతనికి భారమైనానని తోచిన మరుక్షణం అతన్ని వదిలేస్తాను. కాని నన్ను నరకంలోనుంచి బయటికి తీసుకురావటానికి సాహసించినందుకు అతనికి నే నెన్నటికైనా కృతజ్ఞురాలినే. పాపం, అతను నా శరీరం తప్ప ఏ మపేక్షించాడు? ఆఖరుకు నా మనస్సు కోరటం కూడా చాతకాదతనికి. లోకం నన్ను నీతి పరురాలను కోగలందులకు నేను నా తుచ్ఛ శరీరాన్ని దాచుకునేదా?

ఒకప్పుడు నా శరీరాన్ని నేను ఘనంగా చూచుకోగలిగాను. దాన్ని నే నెన్నడూ చూపియెరగని దివ్యపురుషుడికి నివేదన చేసుకున్నాను కూడాను. భగవంతుడికి నివేదన అయిన అన్నం తన్ను పవిత్రమైనట్టు భావించుకుంటుందో లేదో నే నెరగను. నా శరీరం దివ్యపురుషుడికి నివేదన అయి గర్వించింది. ఆఖరుకు అదంతా ఒక వెర్రి కలగా పరిణమించింది. ఒక పశుతుల్యుడు నా భర్త అనే పేరు పెట్టుకుని పచ్చి నా శరీరంమీద తనకున్న తుచ్ఛమైన హక్కులు అమిత నీచమైన పద్ధతిలో వినియోగ పరిచాడు.

ఒకవేళ నే కలగన్న దివ్యపురుషులు ప్రపంచంలో ఎక్కడా లేరేమో! నాలో స్త్రీత్వమూ, ఇంద్రియవాంఛా ఉండదగినంతగా లేవేమో. (ఈ మాట వింటే మా అన్నలు నిర్ఘాంతపోతారు కామాలు.) ఇతర స్త్రీలంతా ఏ అనుభవానికి పరవశు లవుతున్నారో ఆ అనుభవమే నాకు అసహ్యకరంగా ఉందేమో! నేను చెప్పలేను. నా స్వేచ్ఛ పోయిన తర్వాత నేను ఏసుఖం అనుభవించ లేను. నేనేం చెయ్యను? నన్ను భగవంతుడట్లా సృష్టించాడు. నేను కలగన్న దివ్యపురుషుడు నా స్వేచ్ఛను గౌరవించాడు. అతనివల్ల సుఖం పొందకుండా ఉండేటందుకు మానసిక సుఖం పొందానేమో.

నా భర్త నా స్వేచ్ఛను పాటించలేదు: ఆయనతో సుఖం పొందకుండా వుండేటందుకు నాకు హక్కులేదు. నా తత్వానికది సరిపడలేదు—నేను ఆడదాన్ని కాదనుకున్నా సరే. ఎవరైనా బలవంతాన పంచదార నా నోట్లోకుక్కితే అది ఆ సమయాన విషతుల్యంగా ఉండి ఆ చేదు నోరు కదు




క్కుంటే కానిపోదు; ఆపంచదార ఉమ్మెయ్య కుండా ఉండలేను.

నేను నా భర్త దగ్గిర సుఖంచాలక శేషాచలంతో లేచి వచ్చినందుకు నేను కష్టాలపాలవుతానని కాదు వాళ్ళ దిగులు, యెక్కువ సుఖపడుతున్నానని. మా అమ్మమ్మ ఎప్పుడూ అంటూ వుండేది "నాజూకు మరిగిన కళ్ళకు కాటిక పెట్టుకోక పోవటం నాజూ కయ్యే టట్టయితే బలవంతాన మోటపని చెయ్యటం దేనికి?" అని అడిగితే, నేనేమిటో కాటికను దూషించినట్టు 'కళ్లకు కాటిక పెట్టుకుంటే యెంత అందంగా వుంటుంది?' అని మళ్ళీ తానే అనేది, కొంచెం హెచ్చు తగ్గుగా మా వాళ్ళందరిదీ ఒకటేరకం తర్కం.

ఈ నెల రోజులలోనూ నాకు చాలా ఉత్తరాలు వచ్చినై. నేను కాపరానికి వెళ్లింది లగాయతు ఈ క్షణంవరకూ నేను జీవించే వున్నానో లేదో కూడా విచారించని దూరపు బంధువులు కూడా పోస్టు ఖర్చులు పెట్టుకుని ఉత్తరాలు రాశారు. నాముక్కు చిట్టిముక్కని నాయెదుట అనడానికి కూడా ధైర్యం లేని వారందరికీ నన్నింతంతమాట లనటానికి ధైర్య ఎట్లా కలిగిందో నా కాశ్చర్యంగా వుంది. నేను చేసిన పని నా మనస్సును తప్ప అందరి మనస్సులను ఇంతగా కలవర పెట్టి వారిని ఇంత అసహ్యాకరమైన రాతలు రాయటానికి పాల్పడ చెయ్యటం విశేషమైన సంగతే. వాళ్ళను పశువులకంటె హీనంగా చెయ్యగలిగాను నేను,

అందులో ఒక ముసలాయన "కామోద్రేకము, యౌవన మదమూ" అనేమాటలు తనివితీర వాడాడు. నాలో ఇంత కామోద్రేకం వుందని తెలిసిన తరువాత ఆయన దృష్టిలో నేను కొత్తదాన్ని అయి వుంటాను ఆయనకు తెలియకుండానే ఆయనకు నామీద కొత్త అభిమానం కలిగిందని నా నమ్మకం. కాని ఉత్తరంలో మట్టుకు నన్ను బాగాతిట్టి నామీద కిలిగిన రహస్యోద్రేకాన్ని కొంత వరకు ఉపశమించుకున్నాడు.

చాలామంది నేను తమ పరువు తీసేపినందుకు నన్ను దూషించారు. వారి పరువు ప్రతిష్టల కోసమే నేను భువిలో అవతరించాననే భ్రమ వారి కెందుకు కలిగిందో నేనుయే మాత్రము ఊహించ లేకుండా వున్నాను నాకు వారి పరువు తీసే శక్తిసామర్థ్యాలున్నవని ఏమాత్రం తెలిసినా అందులో కొందరి కోసమైనా ఈ పని ఎన్నడో చేసి ఉందును.

మొత్తం మీద నాకుయెంత దగ్గిర బంధులైతే నన్ను అంత అధికంగా తూలనాడారు. దగ్గిర చుట్టరికాలు ఇందుకైనా పనికివచ్చినై. మా అన్నలు రాసింది. షరీ బాగుంది. ఇక మీదట నాకూ తమకూ యెటువంటి సంబంధమూ లేదట, నాగతి ఏమైనా వారికి పట్టదట, నేనిక వారి చెల్లెల్ని కానట వారు, నాకన్నలు కారట, ఇకముందు నేను పడబొయ్యే పాట్లు కుక్కలూ, నక్కలూ పడవట.

నన్ను ఏదో విధంగా వదిలించుకుని ఒక అయ్యచేతిలో పెట్టటానికి నా అన్నలు ఎంత ఆరాటపడ్డదీ నేను మరవలేను. నా భర్తకు ఎంత కట్నం ఇవ్వాలి—అనగా నేను ఎటువంటి భర్తతో కాపరం చెయ్యాలో నా అన్నలు నిర్ధారణచేశారు. ఆ నిర్ధారణ ఎంత నిశ్చింతగా చేశారో నా కింకా జ్ఞాపకం ఉంది. నాకు విచారించిన రెండు సంబంధాలు కట్నంలో తేడా వచ్చింది. నాకూ, నన్ను పెళ్ళి చేసుకోవటానికి అంగీకరించిన మరో




కుర్రవాడికీ మధ్య అయిదువందల రూపాయలు అడ్డం వచ్చినై. అయిదు వందల రూపాయలకూ నా అదృష్టానికీ పోరాటం వచ్చింది. నా ఆదృష్టం ఓడిపోయింది అతను ఇప్పుడు ప్రసిద్ధుడు. అతనికి దేశమంతటా కీర్తి వచ్చింది. కాని అందులో నాకేమీ భాగం లేదు!

నేను కాపరానికి వెళ్ళిన తర్వాత నా అన్నలకూ నాకూ ఏమి బాంధవ్యం మిగిలిందో నా కర్థంకాలేదు. వాళ్ళు వాళ్ళ వాళ్ళ మామగార్లనూ, భార్యల మేనమామ కూతుళ్ళనూ నా కంటే ఎక్కువగా చూసుకున్నారు. వారి భార్యల దగ్గిర చుట్టాలంతా తరుచు వస్తూపోతూ ఉండే వారు. ఎటువచ్చీ చుట్టపు చూపు నాదే అయింది. నా కెప్పుడైనా తల నొప్పి వస్తే మా అన్నలుగాని, వదినెలుగాని ఆదుకున్నట్టు నా కెక్కడా స్ఫురణకు రావడం లేదు. నేను పడబొయ్యే పాట్లు కుక్కలూ, నక్కలూ పడవని మా అన్నగార్లనుకుంటే, అందుకు వాళ్ళు నన్ను చూచి జాలిపడినంత వరకూ. అది వాళ్ళకోరికేగాని మరొకటి కాదని నేను భావిస్తాను. ఒకవేళ ఈ జీవితంలో నేను సుఖపడటమే జరిగితే వాళ్ళ హృదయాలు ఎంత ఖేదిస్తవో!

అన్నిటికన్నా ఆఖరుకు వచ్చింది. మా మరిది సత్యం ఉత్తరం. అసలు మా అత్తవారి తరఫున నాకు వచ్చిన ఉత్తరం అది ఒకటే. నాకు వచ్చే ఉత్తరాలు ఎట్లా ఉండేది బాగా అనుభవం కావటంవల్ల తిట్టుకుంటూ కవరు చించి ఆ ఉత్తరం బయటికి తీశాను. సత్యందస్తూరి నేను గుర్తించలేదు.

సత్యం రాసిన నాలుగు ముక్కలూ చదువుకుంటే నా గుండె నీరయిపోయింది. ఎంత చక్కగా రాశాడు సత్యం! నా కోసం పాపం. ఆ కుర్రవాడు తన మానవత్వం విసర్జించి దేవత్వం పొందాడేమో అనుకుంటాను. నా అంధకారమయజీవితానికి ఆ ఉత్తరం చల్లని చంద్రకిరణం—నా కొక అపూర్వ సంఘటన. ఒక జీవితాన్ని పవిత్రం చెయ్యటానికి అటువంటి సంఘటనలు నాలుగు చాలవా? మిగిలినదంతా నిస్సారమైన చెత్త. నేనిక జీవితంలో ఏమీకోరను; అటువంటి సంఘటనల కోసమే జీవించి ఉంటాను. బాధ అనుభవిస్తే ఆనందంవల్ల కలిగేబాధే అనుభవించాలి. సత్యం ఉత్తరంవల్ల నాకు కలిగిన ఆనందంలో ఎంత తీవ్రమైన బాధ వుంది!

"వదినా, ఇంతకాలమూ నీ వంటి ఆడది లేదని నమ్ముతూ వచ్చాను. ఇప్పుడా నమ్మకం మార్చుకోబోను. కాని అదివరకు లేచి పొయ్యేవాళ్ళను చాలా అగౌరవంతో చూసేవాణ్ణి. ఇకముందు అటువంటి తుచ్ఛమైనపని చెయ్యను. వెనక మా ఇంటిపక్కవా రమ్మాయి లేచిపోయినందుకు నా మనసులో ఆమెను గురించి అనరానిమాట లనుకున్నాను. ఇవాళ అవన్నీ జ్ఞాపకంవచ్చి ఆ మాటలు నిన్నే అంటే ఎంత బాధ కలుగుతుందో అంతబాధ కలుగుతున్నది.

"నీకీ ప్రపంచంలో ఎవరూ లేరని తోచినప్పుడు నన్ను మరిచిపోకు—నీ మరిది. సత్యం," అని రాశాడు సత్యం.

ఈ ఉత్తరానికి సమాధానం రాయక తప్పదు. పైగా నేను సత్యానికి ద్రోహం చేశాను. నేను మా అత్తవారి యింటినుంచి శేషాచలంతో లేచివచ్చేనప్పుడు నా అంతరాత్మను యెవరూ బాధించలేదుగాని సత్యం బాధించాడు. ఆ అబ్బాయి సదభిప్రాయం కోసం నేను నిర్బంధంనించి బయట పడడానికి చాలా సంశయించాను. నా దృఢ సంకల్పానికి అడ్డంవస్తున్నందుకు అతన్ని చాలా తిట్టుకున్నాను. నే నీ పని చెయ్యటంలో చేసిన ఒక త్యాగమూ సత్యమే.

అతనిట్లా రాస్తాడని నా కెట్లా తెలు

స్తుంది? నా జీవితానికి స్నేహితుడూ. కొడుకూ, భర్తా, సత్యం ఒకడే. అతని కోసమే నేను ఏబాధ అయినా సంతోషంతో పడ్డాను. అతని ఒక్కడి శాసనమే నేను ఇష్టపడి పాటించాను. ఎందుకంటే అతని హృదయంలో నాకన్న దగ్గిరమనిషి లేడు. నా అహంకారాన్ని ఆ కుర్రవాడెంత తృప్తి పరిచాడు! నన్ను తన తల్లికన్న ఎక్కువ గౌరవంగానూ, ప్రేమగానూ చూశాడు. తల్లి దగ్గిర తీసికోని చనువు నాదగ్గిర తీసుకున్నాడు. తన కష్టం కన్నా నాకష్టం ఎక్కువగా చూసేవాడు. చిన్నతనంచేత అతను నన్ను స్వల్పవిషయాలలో బాధపెడితే, నిర్బంధిస్తే నేనెందుకు సహించలేక పోతానూ? నా బిడ్డ నన్ను అంతకంటె ఎక్కువగా చూస్తాడా? నా సొంత కొడుకైనా నన్ను పనిపెట్టుకొని బాధిస్తే నేను క్షమించి ఉండను.

అవును, నాకు సత్యమే భర్త కూడాను. అతను యెక్కడికన్నా వెళ్ళిరాగానే నాకు యిల్లు నిండినట్టుండేది. అతని మనస్సు ఎంత సున్నితంగా సుఖపడేది, కష్టపడేది నాకు అర్థమయ్యేది. అతను నన్నెన్నడూ చులకనగా చూడలేదు; నా భర్తమాదిరిగా నన్ను "ఏమే" అని పిలవలేదు. అతన్ని నేను ఏమండి అని పిలవ నవసరం కలగలేదు. అతను వస్తే నేను లేచి నుంచోలేదు. వేసవికాలంలో అందరూ హాయిగా బైట పడుకుంటూంటే నరకకూపమైన పడక గదిలో, ఆ ఉక్కలో తనతో కూడ పడుకోమని అత నెన్నడూ నన్ను నిర్బంధించలేదు, నేను ఊరికే ఉండిపోయినానని అతను నా కెన్నడూ పనులు చెప్పలేదు. నన్ను గాఢనిద్రలో నుంచి తన కక్కుర్తి కోసం లేపలేదు. నేను ఒకనాడు కలతనిద్రలో ఉండగా "వదినె నిద్రపోతున్నది, ఎందుకర్రా అంత బిగ్గరగా అరుస్తారు?" అని అతననటం విన్నాను. నేను కలలో కన్న దివ్యపురుషుడు కేవలం మిథ్యకాదేమోననే నమ్మకం కలిగించాడు సత్యం. అతను కాకపోతే నాకిక ఈ ప్రపంచంలో భర్త యెవరు?

"నీ ఉత్తరం అందింది. నేను లేచిపోయినందుకు తిట్టవివాడివి నువ్వొడివే. నేను కూడా ఇటువంటిపని చేసినందుకు నీ ఒకడికోసమే పశ్చాత్తాపపడుతున్నాను. కానేం చేయను?

"నేను ఐదు సంవత్సరాలపాటు స్వచ్ఛమైన పాతివ్రత్యం చేశాను. సత్యం. అత్తగారికీ, భావమరుదులకూ, భర్తకూ, ఆడబిడ్డలకూ ఒళ్ళు దాచుకోకుండా సేవ చేశాను. నన్నెవ్వరూ ఒక్కదానికి కూడా తప్పుపట్టలేదు. నేను తప్పు పట్టించుకోననీ అభిమానవతిననీ అందరూ మెచ్చుకున్నారు. అంతకాలమూ నేను పరపురుషుణ్ణి చూడలేదు. స్మరించలేదు. కాని ఏమైంది? నేను అపూర్వమైన పతివ్రతననే విశ్వాసం మీ అన్నగారికి కలిగించా? నా కష్టసుఖాలు తమ కష్టసుఖాలనుకోక నన్ను త్యాగం చెయ్యడానికి నియమించారు! నాకు కష్టపడటం చాతనవునని కష్టమంతా నాకే విడిచిపెట్టారు. నాకు నలుగురితోపాటు సమత్వం యెందుకు లేకపోయిందీ? కోడలిననా? ఆదర్శప్రాయురాలైనందుకు ప్రతిఫలం ఏమీలేదా?—మెప్పు తప్ప!

"ఈ పాతివ్రత్యం నాకు అర్థంలేందిగా కనిపించసాగింది. నా భర్త తిన్న విస్తట్లో తినడానికి కూర్చున్నా, ఆయన వచ్చినప్పుడు లేచి నిలబడ్డా, ఆయనకు కాళ్లు పిసికినా, ఆయన రమ్మన్నప్పుడు దగ్గిరగా వెళ్ళినా నా అంతరాత్మ తీవ్రంగా ఎదురుతిరుగ సాగింది, అందరూ మెచ్చుకుంటారనే ఆశకన్న నా అంతరాత్మను ఎదుర్కోలేని అవమానం జాస్తి అయింది.

"నీ అంతరాత్మ విడువకుండా నీ వెంట తగిలి "సిగ్గుమాలిన పని చేస్తున్నావు! నీకు సిగ్గూ శరమూ లేదు." అంటుంటే నీ పద్ధతి మార్చుకోకుండా యెంతకాలం వుండగలవు, సత్యం? లోకం నిన్ను మోసగించు తున్నదనీ, నీ భర్తతో నీవు పొందే అనుభవం అతి హేయమైనదనీ, నీ కోసం నీకళ్ల యెదుట నే బాధపడుతున్న శేషాచలంతో నీవు రంకుతనం చెయ్యటం యింతకంటె యెక్కువ పాపం కాదని నీ అంతరాత్మ నొక్కి చెబుతుంటే ఏం చేస్తావు?

"ఆ మాటలు వినిపించుకో లేకపోతే నీ కొక అంతరాత్మ వుండి ఏం ప్రయోజనం? అంతరాత్మలు పొరబాటు పడవని చెప్పను. అవికూడా మన అనుభవానికి అనుగుణ్యంగానే సంస్కారం పొందుతై. కాని తప్పో ఒప్పో అంతరాత్మను అనుసరించటంకన్న వుత్తమమైన ఆదర్శం ఏమిటి చెప్పు? అంతరాత్మకు విరుద్ధంగా వెళ్ళవలసిన సాంఘికాదర్శాలకు మనమంతా సిగ్గుపడరాదూ? అంతరాత్మకు సూటిగాపోతున్న నేనా సిగ్గుపడవలసింది? నన్ను తిట్టేవాళ్ళకు నేను ఎంత క్షేమాన్ని త్యాగం చేశానో తెలియదు సత్యం!

"మా నాన్న ఎంత స్వేచ్ఛాప్రియుడో నీకు తెలీదు. ఆయన ఉద్యోగం చేయటం ఇష్టంలేక మాడి చచ్చిపోయినాడు. ఆయన చావుబ్రదుకుల్లో ఉన్నప్పుడు వైద్యులుచూసి అహారం లేక జబ్బు చేసిందన్నారు. మా నాయన పోయినతర్వాత నేను ఆ యింటిలో ఉండటం దుర్భరమై లేచి వచ్చేశాను. నాకు మీ వాళ్ళమీద కోపంలేదు. ఇతర అత్తగార్లు నా అత్తగారికంటె మంచివాళ్ళని నాకు నమ్మకంలేదు. నా భర్తకూడా ఇతర భర్తలకంటె హీనుడనుకోను. నన్నింత గౌరవంతో చూస్తున్న శేషాచలం, భార్యను యెట్లా చూసేవాడో నే నెరుగుదును, ఎవరికీ యిష్టంలేని ఈ పనిచేసి నేను పొంద గలిగిందల్లా స్వేచ్ఛతప్ప ఇంకేమీలేదు. ఆసంగతి తెలిస్తే, లోకం నన్ను కొంతవరకు క్షమిస్తుందేమో, ఏమంటే ఇప్పు డందరికీ ఆగ్రహం నేను సుఖపడిపోతున్నాననే. స్వేచ్ఛ నాకు సుఖంకలిగించే మాట నిజమేగాని, స్వేచ్ఛ యెవరికిగావాలి? అంతగా కావలసిన వాళ్ళుంటే నా మాదిరిగానే స్వేచ్ఛకోసం త్యాగం చెయ్యకపోరు.

నీవురాసిన అందమైన ఉత్తరానికి ఈ అసహ్యకరమైన సమాధానం రాశాను. నీకు అసహ్యం కలిగించటానికి గాదు. నీతో చెప్పుకోవటం నాకు సంతోషం. నే నింకెవరితో చెప్పుకుంటాను?—నీ వదినె.—"